క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పాత బజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సంగీత శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పాత బజారులో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కరకట్టకు మరమ్మతులు చేయాలి

డోర్నకల్: పెరుమాళ్లసంకీస గ్రామ రాముడి చెరువు కరకట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని పెరుమాళ్లసంకీస శివారు రాముని చెరువులో జరుగుతున్న కరకట్ట, తూము పనులను శనివారం రైతు సంఘం ప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరెడ్డి, గండు రవి పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చిన్నగూడూరు: పేదలపాలిట వరంగా సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో లబ్ధిదారుడు బర్పటి ప్రభాకర్‌కు మంజూరైన రూ.1.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కంచనపల్లి వెంకన్న, సూధగాని నగేష్, దాసరి శ్రీను, వడ్లకొండ ఆదాం, కొత్త శేఖర్ పాల్గొన్నారు.

కాపర్‌వైర్ చోరీ

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో తవనం సుఖేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌లోని కాపర్‌వైర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బావి వద్ద ఉన్న విద్యుత్ మోటర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బయ్యారం: మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు జవ్వాజి గణేశ్ అధికారులను కోరారు. శనివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవటం వల్ల ప్రాథమిక, ఉన్నత విద్యకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

సన్మానం



మహబూబాబాద్ అర్బన్: ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్దెర్ల రమేశ్ డాక్టరేట్ పట్టా సాధించిన క్రమంలో నలంద విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఫరీద్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు శంకర్, కృష్ణరావు, గోవర్ధన్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో శ్రమదానం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

డోర్నకల్: బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచడాన్ని హర్షిస్తూ స్థానిక గాంధీసెంటర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదా శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, తారాచంద్ పాల్గొన్నారు.

అవసరం ఉన్న వారే యూరియా తీసుకోవాలి

బయ్యారం: మండలంలో సాగు చేసిన పంటల్లో అవసరం ఉన్న రైతులే యూరియాను తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంజీ సూచించారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు.

శునకాలకు చర్మవ్యాధి

- 40శాతం వీధి కుక్కలకు డిసీజ్
- భయపడుతున్న ప్రజలు



పెద్దవంగరలో చర్మ వ్యాధితో వీధి శునకం

పెద్దవంగర: ఒకప్పుడు పల్లెలో వీధి శునకాల ఉనికి సాధారణ విషయం. సమాజంలో అవి అంతర్భాగంగా ఉండేవి. అవి కేవలం మన గల్లీలకు కాపలదారులుగా మాత్రమే కాకుండా, ఓ మానవీయ బంధంతో మన పరిసరాల్లో విహరిస్తుండేవి. రాత్రి వేళల్లో చోరీలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజలకు భద్రతను అందించేవి. వాటి ఉనికి మానవత్వానికి ప్రతీకగా నిలిచేది. తిండి తినడానికి కూడా భయపడుతూ గ్రామాల్లో మూలల్లో నిద్రపోతు జీవించేవి. కొందరూ మానవత్వంతో ఆహారంపెట్టి నీరు పోసి సాధుకునేవారు. అలా ఒకప్పుడు జాలిగా కనిపించిన ఆ వీధి కుక్కలు ఇప్పుడు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాటి దుస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. ప్రస్తుతం అవి చర్మ వ్యాధులు (స్కిన్ డిసీజెస్) ఇతర అనారోగ్యాలతో బాధపడుతూ ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నారు. మండలంలో 1,556 వీధి కుక్కలు ఉన్నాయి. అయితే ఈ వీధి కుక్కల్లో సుమారు 40శాతం స్కిన్ డిసీజెస్ బారిన పడినట్లు తెలుస్తోంది. కాలం మారే కొద్ది పరిస్థితి తారుమారైంది. ఒక్కప్పుడు జాలిగా కనిపించిన వీధి కుక్కలు ఇప్పుడు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. ఇది కేవలం మూగజీవాల సమస్య మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే అంశమని ప్రజలు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి..

ఇలాంటి పరిస్థితుల్లో ఈ మూగ జీవాల బాధన అర్థం చేసుకోవడం, వాటి సమస్యకు మానవత దృక్పథంతో పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామ శునకాలు మన సమాజపు భాగమేనని, వాటిని నిర్లక్ష్యం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు సమస్య కానుందని జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధిత పశు వైద్యాధికారులు శునాలకు వ్యాక్సిన్ వేయించేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఎలాంటి ముప్పులేదు



వీధుల్లో తిరిగే శునకాల్లో శుభ్రత లేకపోవడం, చలి, వర్షాలు, చెత్తా దగ్గరే ఎక్కువగా తిరగడం వల్ల చర్మ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. ఈచర్మ వాధులు మానవులకు ముప్పు కలిగించేవి కావు. స్కిన్ డిసీజెస్ వంటి సమస్యలకు పశు వైద్యశాలల్లో సులభంగా చికిత్స అందజేస్తాం. వ్యాక్సిన్లు వేయించడం వంటి చర్యలు చేపడితే సరిపోతుంది. మూగజీవాలపై ప్రేమతో వ్యవహరించాలి.

– రాజశేఖర్, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, పెద్దవంగర

మున్నేరు నీటిని తరలిస్తే ఊరుకోం..

న్యూడెమోక్రసీ నాయకుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న జడ సత్యనారాయణ

గార్ల: గార్ల మండలం నుంచి మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఈ ప్రాంత రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గార్ల మండలంలోని మున్నేరు నీటిని గార్ల మండల రైతాంగం సాగుకు ఉపయోగపడకుండా పాలేరుకు తరలించేందుకు ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన నియోజకవర్గ రైతాంగం కోసం రూ.168 కోట్లు మంజూరు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి నీరు గార్ల మండలం గుండా కాలువల ద్వారా తీసుకెళ్తే, ఈ ప్రాంత రైతాంగం ఎలా చూస్తూ ఊరుకుంటుందన్నారు. మున్నేరు నీటిని మండలంలోని భూములకు సాగు నీరు అందిస్తూ, పాలేరుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గౌని భద్రయ్య, కుసిని బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పీఆర్సీని అమలు చేయాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పీఆర్సీని అమలు చేయాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హనుమంతరావు అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని వీసీబీ కన్వెన్షన్ హాలులో సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ–ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జింగిరాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, పింగిళి శ్రీనివాస్, రావుల యాదగిరి, పెంటయ్య, రాగి సోమ నర్సయ్య చారి, వోమ సంతోష్, నరహరి, తిరువేంకటాచార్యులు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వాణి దేవి, శ్రీశైలం, సామల రమేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

నెల్లికుదురు: మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీసీ సంఘం జిల్లా నాయకుడు బొమ్మెర ఎల్లగౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

బయ్యారం: చికిత్స పొందుతున్నప్పటికీ జబ్బు నయం కావడంలేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండలంలోని సాంబతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన గుగులోత్ విజయ్(24) కొంతకాలంగా తలనొప్పి, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నప్పటికి ఫిట్స్ తగ్గకపోవటంతో ఈనెల 10న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడి అక్క బాణోత్ దీప ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెండతోట ధ్వంసం.. కేసు నమోదు

డోర్నకల్: బెండతోట ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. చిమ్నాతండాకు చెందిన గుగులోత్ పూల్యా అదే తండాకు చెందిన గుగులోత్ శంకర్, గుగులోత్ సుధాకర్ వద్ద స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని ఖాళీ స్థలంలో బెండతోట సాగు చేస్తున్నాడు. ఇటీవల గుగులోత్ శంకర్ తోట స్థలం తనదంటూ బెండ చెట్లను ధ్వంసం చేయగా పూల్యా ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



నూతన కార్యవర్గం సభ్యులను సన్మానించిన నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రక్తదానం ప్రాణ దానంతో సమానమని ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మీసేవల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బైరీ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవనంలో శనివారం మీసేవ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు ఆన్‌లైన్ సేవలను మరింత అందించాలన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాధితులకు రక్తదానం అందించడానికి శిబిరం నిర్వహించామన్నారు. అనంతరం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులను, ఇతర జిల్లా అధ్యక్షులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు రామ్ ప్రసాద్, అనిల్ కుమార్, నరేష శంకర్ పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసిక ఉల్లాసం



రన్నింగ్ చేస్తున్న సీఐ మహేందర్ రెడ్డి, తదితరులు

మహబూబాబాద్ రూరల్: ప్రతీ రోజు వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు శనివారం ఐదు కిలో మీటర్ల రన్నింగ్ చేశారు. టౌన్ పోలీసుస్టేషన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి టౌన్ పోలీసు స్టేషన్ వరకు రన్నింగ్ చేశాక టౌన్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడారు. 24/7 ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉండే ప్రతి పోలీస్ అధికారికి వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తద్వారా ఉద్యోగంలో చక్కటి ఫలితాలు సాధించవచ్చని, ప్రతీ ఒక్కరు వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై శివ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మహబూబాబాద్ రూరల్: ఆర్థికసాయం చేస్తున్న విద్యుత్ అధికారులు



పెద్దవంగర: ఆర్థికసాయం చేస్తున్న ఉద్యోగులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ అన్‌మ్యాన్ హెల్పర్ గట్ల కరుణాకర్ రెడ్డి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందగా ఆయన కుటుంబానికి శనివారం విద్యుత్ ఉద్యోగులు ఆర్థికసాయం అందజేశారు. మహబూబాబాద్ సబ్ డివిజన్ తరపున రూ.1.05లక్షలు, అన్ మ్యాన్ కార్మికుల పక్షాన రూ.20వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పి.వెంకటేష్, ఏఈ వీరభద్రం, లైన్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్ రెడ్డి, వీరాచారి, లైన్ ఇన్‌స్పెక్టర్ సంపత్, లైన్‌మన్లు పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న వేముల సంతోస్ భార్య ఝాన్సీ ఇటీవల మృతి చెందారు. శనివారం జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎఫ్ఏఓ మహంకాళి బుచ్చయ్య, మల్లేష్, బాబులాల్ సీఆర్పీలు, రమేష్, నిరంజన్, అనిల్, శ్రీనివాస్, బాలాజీ, వీరస్వామి, రవి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి



శిక్షణ పొందిన మహిళలతో సంస్థ ప్రతినిధులు

తొర్రూరు: మహిళలు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందాలని సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. వరంగల్ ఎఫ్ఎంఎం స్వచ్ఛంద సంస్థ సహకారంతో శ్రీవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో కొద్ది రోజులుగా కొనసాగుతున్న మగ్గం, టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు, బ్యూటీషియన్ శిక్షణ దోహదపడుతుందన్నారు. మహిళలు ఎదిగితే కుటుంబాలు, సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సేవా సంస్థ డైరెక్టర్ సహాయ, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై స్పష్టత ఏది?

- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మాట్లాడుతున్న రెడ్యానాయక్

దంతాలపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ రిజర్వేషన్‌పై స్పష్టత ఏది అని మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ప్రశ్నించారు. మండలంలోని రెఖ్యతండా జీపీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌పై ఆటలాడుతుందని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ అమలు చేసి చూపాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్ పాలనతో, బీజీ రిజర్వేషన్‌పై విరక్తి చెందారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, కిశోర్, నూకల గౌతంరెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు జలాలు విడుదలకు సిద్ధం



పంపు సెట్ల ట్రయల్ రన్ చేపట్టిన అధికారులు

మరిపెడ రూరల్: పాలేరు రిజర్వాయర్ నుంచి భక్త రామదాస్ పైపులైన్ ద్వారా ఖరీఫ్ పంటలకు సాగు జలాలు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శనివారం మరిపెడ శివారు ప్రాంతంలో ఉన్న భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పంపు సెట్‌ను అధికారులు ట్రయల్ రన్ చేపట్టారు. కొంత కాలంగా మోటార్లు పని చేయకపోవడంతో సాగు నీరు అందలేదు. ఈసారి ఖరీఫ్‌కు సాగు జలాలు అందించాలన్న లక్ష్యంతో అధికారులు భక్తరామదాసు ఎత్తిపోతల పంపుసెట్లను పునరుద్ధరించి సాగు జలాల విడుదలకు సిద్ధం చేశారు. ఈసాగు జలాలు డీపీఎం–60 కెనాల్ గుండా మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ పరిధిలోని ముత్యాలమ్మ కుంట, ఖరీదుకుంట, నవేలకుంట, అదేవిధంగా గాలివారిగూడెం బట్టగాని కుంట గొలుసుకట్టు ద్వారా పురుషోత్తమాయగూడెంలోని పెద్దచెరువుకు నీరు అందుతుంది. దీంతో ఆయా చెరువు, కుంటల కింద 850 ఆయకట్టు ఎకరాలకు సాగు జలాలు అందనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మందుబాబులకు అడ్డాగా చర్చి గ్రౌండ్



చర్చి మైదానంలో పడేసిన మద్యం, వాటర్ బాటిళ్లు

డోర్నకల్: స్థానిక చర్చి కాంపౌండ్ క్రీడా మైదానం మందు బాబులకు అడ్డాగా మారింది. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో అతి పెద్ద క్రీడామైదానంగా గుర్తింపు పొందిన చర్చి కాంపౌండ్ క్రీడామైదానం క్రీడాకారులు, వాకర్లతో నిత్యం సందడిగా ఉంటుంది. రాత్రి 8గంటలు దాటిన తరువాత తాగుబోతులకు అడ్డాగా మారుతోంది. మద్యం తాగిన తరువాత సీసాలు పగలగొట్టడం, వాటర్ బాటిళ్లు, బీరుసీసాలు, భోజనం ప్లేట్లను మైదానంలో పడేస్తుండటంతో తెల్లవారు జామున వాకింగ్‌కు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు స్పందించి చర్చి కాంపౌండ్ క్రీడా మైదానంలో తాగుబోతుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చుట్టపు చూపుగా వార్డెన్



ఎస్సీ బాలుర హాస్టల్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రం హస్తినాపురంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్ విద్యార్థుల సమస్యలు పట్టనట్లుగా చుట్టపు చూపుగా వస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం కావడంతో ముందస్తుగానే గురువారం హాస్టల్‌కు వచ్చిన వార్డెన్ విద్యార్థులకు కావాల్సిన సరుకులు కూరగాయలు అందించి వెళ్లిపోయినట్లు విద్యార్థులు చెబుతున్నారు. దీంతో ఆ వార్డెన్ ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. వార్డెన్ విధులకు ఎగనామం పెట్టడం విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నాగయ్యకు డాక్టరేట్

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు నాగయ్య ఇటీవల వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో టీడీపీ మండల కమిటీని టీడీపీ రాష్ట్ర పరిశీలికులు యానాల అనంతరెడ్డి పర్యవేక్షణలో శనివారం అర్బన్, రూరల్ కమిటీలను ఎన్నుకున్నారు. అర్బన్ అధ్యక్షుడిగా బొమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా తల్లా శ్రీనివాస్, రూరల్ కమిటీ అధ్యక్షుడిగా బానోత్ హరికిషన్, ప్రధాన కార్యదర్శి క్లోం మధుసూదన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచందర్‌రావు, వెంకట్ నారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ భూక్య సునీత, ప్రేమ్ చంద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేల ఆర్థికసాయం

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో ఇటీవల గీసగాని ఉపేందర్–కవితలు ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కవిత తలకు తీవ్ర గాయాలు కాగా అత్యంత దయనీయమైన పరిస్థితిలో మంచం పట్టడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులు శనివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొగిలిచర్ల లక్ష్మీనారాయణ, బత్తుల వెంకన్న, నామా సైదులు, పిట్టల ఉపేందర్ పాల్గొన్నారు.

మరిపెడలో మోస్తరు వర్షం

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వర్షం కోసం ఎదురు చూస్తున్న పత్తి, పెసర తదితర సాగు పంటల రైతులకు ఉపశమనం లభించింది. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హామీని అమలు చేయాలి

డోర్నకల్: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పెంపు హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో శనివారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో నిర్వహించిన సమావేశంలో రవి మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మంద కృష్ణమాదిగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుట్టల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

పెద్దవంగర: మండల కేంద్రంలోని తొర్రూరు మెడికేర్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేముల వెంకన్న, వైద్యులు నరేష్, రాధాకృష్ణ, కిరణ్, కుమార్, శ్రీకాంత్, ప్రతినిధులు సరిత, రమ, మేఘన పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



మహబూబాబాద్ రూరల్: రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని ఐఆర్‌సీఎస్ చైర్మన్ పీవీ.ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న అన్నారు. మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పమ్మి సనాతనాచారి జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పమ్మి సనాతనాచారి, ప్రధాన కార్యదర్శి పూర్ణాచారి, కోశాధికారి హరి, మోత్కూరి శంకర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



రోడ్డుపై ఏర్పడిన గుంత

దంతాలపల్లి: మండలకేంద్రంలో రహదారిపై గుంత ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలో సూర్యాపేట ప్రధాన రాహదారిపై ఈ గుంత ఉన్నా అధికారులు పట్టించుకోపోవడం బాధాకరం అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంత సుమారు మూడు మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల పొడవుతో ఉంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.